## క్లుప్తంగా

### గురుకుల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: ములుగు సాంఘిక సంక్షేమ విద్యార్థినులపై నిర్లక్ష్యం వహిస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ గజ్వేల్ డివిజన్ క్యాదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురుకుల విద్యాలయంలో విద్యార్థునులను ఎలుకలు కరిచినా పట్టించుకోని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలన్నారు. రెండు నెలలవుతున్నా నేటికీ పాఠ్య పుస్తకాలు అందించలేదని వాపోయారు. హాస్టల్‌లో బొద్దింకలు, ఎలుకల వల్ల విద్యార్థినులు అనారోగ్యం పాలవుతున్నారని, ఆ విషయాలను బయటకు తెలియనీయకుండా అధికారులు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. నాయకులు రాజు, భాను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### లబ్ధిదారులకు ఉచితంగా సిమెంట్


సిమెంట్ అందజేస్తున్న వెంకటేశ్ తదితరులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న 15 మంది లబ్ధిదారులకు లింగాల భార్గవి, వెంకటేశ్ దంపతులు ఆదివారం 15 బస్తాల చొప్పున సిమెంట్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతియేటా తమ కూతురు విభ జన్మదినం సందర్భంగా కానుకలు ఇస్తామని, అందులో భాగంగా ఈ సంవత్సరం పేద దళితులకు సిమెంట్ అందజేస్తున్నామన్నారు. ఇంటి స్లాబ్ నిర్మాణం వరకు ప్రతి లబ్ధిదారుడికి 50 బస్తాల సిమెంట్ ఇస్తామని చెప్పారు. పేదల కల సాకారం చేసేందుకు సిమెంట్‌ను అందించడం ఆనందంగా ఉందన్నారు.

### స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం: బీఆర్‌ఎస్


లద్నూర్‌లో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం

మద్దూరు(హుస్నాబాద్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని బీఆర్‌ఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, ముస్త్యాల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మద్దూరు లద్నూర్, ధర్మారం, సలాఖపూర్, ధూళ్మిట్ట మండల పరిధిలోని బైరాన్‌పల్లి, బెక్కల్ గ్రామాలలో వారు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుమలత, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల సంక్షేమమే ముఖ్యం


చెక్కు అందిస్తున్న నాగరాజు

దౌల్తాబాద్(దుబ్బాక): బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సంబారపు నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో గుజ్జ వరలక్ష్మికి మంజూరైన రూ.17,500 సీఎం సహాయనిధి చెక్కును ఆదివారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు చెక్కును అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, సుధాకర్, ప్రకాశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సౌజన్య

బెజ్జంకి(సిద్దిపేట): మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ సౌజన్య సూచించారు. బెజ్జంకిలో ఆదివారం ఆమె వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంబంధిత ధ్రువపత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. వాహనాలను తనిఖీచేసి పలువురికి చలాన్‌లు విధించారు. ఆమె వెంట కానిస్టేబుళ్లు ఉన్నారు.

# కంపుకొడుతున్న బస్వాపూర్

**పడకేసిన పారిశుద్ధ్యం**
- రెండు నెలలుగా నిర్వహణ శూన్యం
- చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీలు
- కానరాని అధికారులు


బస్వాపూర్‌లో చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీ

కోహెదరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తవడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించారు. అయితే ప్రత్యేక అధికారి కూడా పట్టించుకోపోవడంతో గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది.

**నిర్వహణ అస్తవ్యస్తం**

అడుగడుగునా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఎంపీడీఓనే గ్రామానికి ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆయన గ్రామానికి నామమాత్రంగానే వచ్చి వెళ్తుంటారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కింది స్థాయి సిబ్బంది కూడా పారిశుద్ధ్య నిర్వహణను గాలికొదిలేశారు. గ్రామంలో రెండు నెలలుగా డ్రైనేజీలు శుభ్రపర్చలేదు. దీంతో ఎక్కడికక్కడ మురుగు పేరుకుపోయింది. వీధులు మురుగుకూపాలుగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.


ముందుకు కదలని నీరు

**కానరాని కార్యదర్శులు**

కేవలం బస్వాపూర్ గ్రామంలోనే కాదు అన్ని గ్రామాల్లో పరిస్థితి ఇలానే ఉందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు పట్టణాల్లో నివాసముంటున్నారని, చుట్టపు చూపుగా పంచాయతీలకు వస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏ చిన్నపాటి అవసరం పడినా కార్యదర్శుల కోసం ఎంపీడీఓ కార్యలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. పంచాయతీలో పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు మధ్యాహ్నం వరకే గ్రామాల్లో ఉంటున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

**డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు**


సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. ఆదివారం చిన్నకోడూరులో బీసీ రిజర్వేషన్‌లను 42 శాతం పెంచడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో రాజకీయాలలో బీసీల దశ మారనుందన్నారు. ముఖ్యమంత్రికి బీసీలంతా రుణపడి ఉంటారని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ సామాజిక న్యాయం దిశగా పాలన సాగిస్తున్నారని, అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. సమావేశంలో నాయకులు గణేశ్, నర్సింహులు, చంద్రశేఖర్, సంపత్, గుండు వెంకట్, రాజు, నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నటరాజ పూజోత్సవం


సన్మానం పొందిన కళాకారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వ్యాస పూర్ణిమను పురస్కరించుకొని శనివారం రాత్రి సంస్కార భారతి, మహిళా జాగరణ సమితి ఆధ్వర్యంలో స్థానిక సిద్దిపేట వ్యాస మహర్షి యోగా కేంద్రంలో ఘనంగా నటరాజ పూజా ఉత్సవం నిర్వహించారు. వివిధరంగాలలో సేవలందిస్తున్న కళాకారులు, సాహితీవేత్తలు, నాట్యకారులను సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ, వ్యాస మహర్షి, మహిళా మోర్చా, మహిళా జాగరణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## మురిపాల అరచేత.. గోరింటా పూసింది


గోరింటాకు చూపుతున్న మహిళలు

నంగునూరు(సిద్దిపేట): ఆషాఢమాసం సందర్భంగా నంగునూరు రెడ్డిసంఘం భవనంలో ఆదివారం మహిళలు గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు. గోరింటాకు పెట్టుకుని సరదాగా గడిపారు. చేతులకు పెట్టుకునే గోరింటాకు సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుందని పలువురు మహిళలు అన్నారు. గోరింటాకుతో అంటురోగాలు దరిచేరవని, శరీరాన్ని చల్లబరుస్తుందని చెప్పారు.

## దరఖాస్తుల ఆహ్వానం

దౌల్తాబాద్(దుబ్బాక): మండలంలోని షేర్‌పల్లి బందారంలోని మహాత్మ జ్యోతిబాపులే బాలికల పాఠశాలలో అతిథి అధ్యాపక, ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కరుణ ప్రియదర్శిని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఈడీ, పీజీ పూర్తిచేసిన మహిళ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 79934 56685ను సంప్రదించాలని సూచించారు.

## పేద కుటుంబానికి చేయూత

మర్కూక్(గజ్వేల్): మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన రాజవ్వ కుమారుడు, ఇటీవల భర్త మృతి చెందారు. విషయం తెలుసుకున్న డొనేషన్ డూ ఫర్‌నేషన్ సంస్థ సభ్యురాలు అనురాధ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాగ్య, సంస్థ సభ్యులు నరేశ్‌రెడ్డి, గణేశ్, పాండరి, పాషా, కనకయ్య, నర్సింహులు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్కు అందజేత

మర్కూక్(గజ్వేల్): పేదల కుటుంబాలకు సీఎం సహాయనిధి భరోసాగా మారిందని మాజీ ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన ఉప్పరి సత్యనారాయణకు మంజురైన రూ.28,500ల విలువైన చెక్కును ఆదివారం అందించారు.

## వరుణుడా.. కరుణించవా..!

**కప్పతల్లి ఆటలాడిన చిన్నారులు**


కుకునూరుపల్లిలో కప్పతల్లి ఆట

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో పిల్లలు వర్షం కురవాలంటూ కప్పతల్లి ఆటలు ఆడారు. వర్షాలు కురవక పోవడంతో మొక్కజొన్న, ప్రత్తి పంటలు ఎండు ముఖం పట్టాయి. తగినంత నీరు లేకపోవడంతో వరి నాట్లు వేయలేదని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో ఆదివారం చిన్నారులు కప్పతల్లి ఆటలు ఆడారు. కప్పతల్లి కడుపునిండా.. నీళ్లు పొయ్యి.. దోమతల్లీ.. దోమతల్లీ.. దొడ్డినిండా నీళ్లు పొయ్యి.. అంటూ పాటలు పాడుతూ గ్రామంలో తిరిగారు. గ్రామం కలియ తిరిగిన అనంతరం హనుమాన్ దేవాలయం వద్ద కావడి నుంచి కప్పను బయటకు వదిలారు. కార్యక్రమాన్ని గ్రామస్తులు ఆసక్తిగా తిలకిస్తూ వరుణ దేవుడిని ప్రార్థించారు.


చిన్నకోడూరు(సిద్దిపేట): ఓబులాపూర్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు


బెజ్జంకి(సిద్దిపేట): లక్ష్మీపూర్‌లో బోనాలతో పోచమ్మ ఆలయానికి తరలివస్తున్న మహిళలు

## బోనం ఎత్తి.. మొక్కులు తీర్చి

ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో బోనాలు సంబురాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. దీంతో పండుగ వాతావరణం నెలకొంది. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలెత్తుకొని వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని దేవతలను వేడుకొన్నారు.


హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లిలో పోచమ్మ బోనాలతో మహిళలు

## సంక్షేమబోర్డు రక్షణకు పోరాడదాం



మాట్లాడుతున్న రవికుమార్

మద్దూరు(హుస్నాబాద్): భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమబోర్డు రక్షణ కోసం కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ అన్నారు. ధూళ్మిట్ట మండల కేంద్రంలో ఆదివారం బండారు గట్టయ్య అధ్యక్షతన నిర్వహించిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల రెండో మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి నష్టం వాటిల్లే చట్టాలు తీసుకొస్తుందని ఆరోపించారు. సభలో నూతన మండల కమిటీని ఎంపికచేశారు. అధ్యక్షుడిగా దువ్వెన యాదయ్య, కార్యదర్శిగా బండారి గట్టయ్య, కోశాధికారిగా చొప్పరి రాజు, ఉపాధ్యక్షులుగా భాష బోయిన సత్తయ్య, గండిపల్లి స్వామి, కొలెపాక కనకస్వామి, సహాయ కార్యదర్శిగా భూక్య గోపాల్, పాలేటి రాజశేఖర్, కమిటీ సభ్యులుగా గద్దెల బాలనర్సయ్య, తుషాలపురం రాజు, వెదురు భీమయ్య, మయోజ్, బ్రహ్మచారి, నర్మెట్ట మురళి, గుండె రవి, ఎలక మల్లయ్య, గొడుగు శ్రీనివాసులు ఎంపికయ్యారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్

**ఎస్‌ఐ అరుణ్‌కుమార్**

దౌల్తాబాద్(దుబ్బాక): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్‌ఐ అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి ఆదివారం శ్రమదానం చేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం పాములు, దోమలను నివారించడానికి ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. వీధివీధి తిరుగుతూ ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. అలాగే సీసీ కెమెరాల ఉపయోగాల గురించి వివరించారు. వాహనదారులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శేషం రాజు, సతీశ్‌కుమార్, స్వామి, సాయి చరణ్, నాగరాజు, కుమార్, పరశురాములు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి ఏమిచ్చామన్నదే ముఖ్యం


విజయకేతనం చూపిస్తున్న మల్లారెడ్డి, పూర్వ విద్యార్థులు

**బిస్మాట్ స్టేట్ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమాజం మనకు ఏమిచ్చింది అనేది ముఖ్యం కాదు, మనం సమాజానికి ఏమిచ్చామనేదే ముఖ్యం అని బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రెటరీ జగ్గు మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గురునాథ హైస్కూల్‌లో 2009–2010బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు పట్టణంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 15 సంవత్సరాల క్రితం తమతో చదువుకున్న స్నేహితులందరు కలుసుకుని సంతోషంగా గడిపారు. మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు. ప్రతి వ్యక్తి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, జన్మనిచ్చిన తల్లిదండ్రులను విస్మరించకూడదన్నారు. వారు నేర్పిన మంచిని సమాజానికి పంచాలని చెప్పారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించారు.

## రజక సంఘం నూతన కార్యవర్గం


రజక సంఘం నూతన కార్యవర్గం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట రజక సంఘం ఎన్నికలు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా భూంపల్లి రాజలింగం, భూంపల్లి కనకరాజు, అధ్యక్షుడిగా భూంపల్లి లింగస్వామి, ఉపాధ్యక్షుడిగా చెవిటి శ్యామ్, కార్యదర్శిగా కోడూరి మల్లికార్జున్, సహాయక కార్యదర్శిగా నారాయణరావుపేట నరేశ్, కోశాధికారి అంతగిరి పోచయ్య, డైరెక్టర్లుగా భూంపల్లి చందు, అల్లీపురం మల్లేశం, చిట్టపురం భిక్షపతి, బోనగిరి శ్రీనివాస్, భూంపల్లి శ్రీహరి, మీడియా అడ్వైజర్ చెవిటి సంతోష్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గాన్ని నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు భూంపల్లి లింగస్వామి మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజు, కనకయ్య, అంజయ్య, నందం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి తల్లికి పూజలు


పూజల్లో పాల్గొన్న మహిళలు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని మహంకాళి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు అర్చకుడు వితాల రాజపున్నయ్య శర్మ భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అనంతరం అమ్మవారికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

# రోడ్డు వేసి.. కల్వర్టులు మరిచి..

కోట్లతో రూపాయలు కేటాయించి రోడ్డు నిర్మించారు. రోడ్డుకు రెండువైపులా పంటపొలాలు ఉన్నాయి. సాగునీరు, వర్షం నీరు ప్రవహించడానికి వీలుగా కల్వర్టులు వేయాల్సి ఉంటుంది. కాని అధికారుల నిర్లక్ష్యమో, నాయకుల నిర్లక్ష్యమో తెలియదు కాని రోడ్డు నిర్మించి కల్వర్టులు వేయడం మరిచారు. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

**నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా**
- రూ.1.50 కోట్లతో రహదారి నిర్మాణం
- పొలాల్లో నీరు నిలిచిపోయే ప్రమాదం
- ఆందోళనలో అన్నదాతలు


కల్వర్టులు నిర్మించని బొడిగెపల్లికి వెళ్లే తారురోడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం బొడిగెపల్లి గ్రామం మీదుగా ఒక కిలో మీటరున్నర వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం బొడిగెపల్లి స్టేజీ నుంచి గ్రామం వరకు తారురోడ్డు నిర్మించారు. ఆ తర్వాత కంకర పరిచారు. అయితే తారురోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. దాదాపు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేశారు.

**కల్వర్టు మరిచారు**

ఒక కిలోమీటరున్నర తారురోడ్డు నిర్మాణంలో భాగంగా దాదాపు ఆరు కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. అయితే అధికారులు కల్వర్టులు నిర్మించడం మరిచిపోయారు. దీంతో రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. రోడ్డుకు రెండువైపులా పంటపొలాలు ఉన్నాయి. అసలే వర్షకాలం కావడంతో భారీ వర్షాలు పడితే వర్షపు నీరంతా ఎటూ వెళ్లని దుస్థితి నెలకొంది. దీంతో పొలాలన్నీ వర్షపునీటితో నిండిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. అదేవిధంగా రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాల తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కల్వర్టులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.